నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I హైదరాబాద్, శుక్రవారం 2 మే 2025 SANGAREDDY




సిద్దిపేట జిల్లా ఆకునూరులో కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సర్వే చేస్తున్న ఎంపీడీవో మహబూబ్అలీ

# ఇదేక్కడి చోద్యం

- కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల సర్వే
- సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని ఆకునూరులో ఘటన
- అధికారుల తీరు పై ముక్కున వేలేసుకుంటున్న జనం

చేర్యాల, మే 1 : రాష్ట్రంలో ప్రజాపాలన అందిస్తున్నాం, పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందజేస్తామని నిత్యం చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రుల ప్రకటనలకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న తీరుకు భిన్నంగా ఉంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు అర్హులా ? అనర్హులా అనే విషయాలపై అధికారులు కొందరు కాంగ్రెస్ నాయకులను వెంటబెట్టుకొని సర్వే చేస్తున్నారు.ప్రభుత్వ పథకానికి అసలైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న సర్వే సమయంలో అధికారులు, కింది స్థాయి సిబ్బంది ఉంటేనే లబ్ధిదారుల వివరాలు పూర్తి స్థాయిలో తెలిసే అవకాశం ఉంటుంది. ఇప్పటికే అనర్హులకు ఇందిరమ్మ (జాబితాలో) ఇండ్ల మంజూరులో చోటు కల్పించారని గ్రామానికి చెందిన కొందరు కాంగ్రెస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు బాహాటంగా విమర్శిస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో అధికారులు సర్వే చేయడం విమర్శలకు తావిస్తున్నది. గురువారం మండలంలోని ఆకునూరులో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో ఉన్న లబ్ధిదారులను గుర్తించి అర్హులా లేదా అనర్హులా అనే విషయాన్ని తేల్చేందుకు ఎంపీడీవో మహబూబుఅలీ, గ్రామ కార్యదర్శితో పాటు పంచాయతీ సిబ్బంది, పలువురు కాంగ్రెస్ నాయకులతో సర్వే నిర్వహించారు.దీనిని పలువురు లబ్ధిదారులతో పాటు ఇతర పార్టీల నాయకులు గమనించారు. అధికారులు సర్వే నిర్వహించిన సమయంలో అధికార పార్టీ నాయకులు ఎందుకు వారితో ఉంటున్నారనే విషయాన్ని చర్చించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు సైతం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వేను ఎంపీడీవో మహబూబ్అలీ, కార్యదర్శి సందీప్ నిర్వహించారని, అందులో కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. అధికారులు ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు వెళ్లిన సమయంలో అధికార పార్టీ నాయకులను వెంటబెట్టుకొని వెళ్లడం సరికాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎంపీడీవో మహబూబ్అలీని 'నమస్తే తెలంగాణ' ఫోన్‌లో వివరణ కోరగా ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సర్వే చేస్తున్నామని, కాంగ్రెస్ నాయకులు ఎవరూ లేరని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్వే చేస్తున్నట్లు తెలిపారు.

# పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

వెల్దుర్తి, మే1. వైద్య ఖర్చులు భరించలేని నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లా మాసాయిపేట మండలం రామంతాపూర్‌తండాకు చెందిన బానోతు సునీతకు రూ. 60 వేల సీఎం సహాయనిధి నుంచి మంజూరు కాగా గురువారం నర్సాపూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వారి కుటుంబసభ్యులకు అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగానికి గురై వైద్యం చేయించే స్తోమత లేని ఎంతో మంది పేదలు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం పొంది ఆరోగ్యంగా జీవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకుడు శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్‌యార్డును ఉపసంహరించుకోవాలి



సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లిలో రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు, మహిళలు

గుమ్మడిదల, మే1: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలో ప్యారానగర్ డంపింగ్‌యార్డును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహారదీక్ష గురువారానికి 86వ రోజుకు చేరుకున్నది. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో ఏర్పాటు చేయనున్న డంపింగ్‌యార్డును ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో రైతు జేఏసీ నాయకులు, మహిళా నాయకులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 86 రోజుల నుంచి రిలే నిరాహారదీక్ష చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్‌యార్డుపై స్పందించే వరకు దీక్ష కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యం

- రెండు గంటలు ఆలస్యంగా పరీక్ష
- మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఘటన




పరీక్ష రాస్తున్న విద్యార్థులను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి

తూప్రాన్, మే 1: ప్రైవేట్ కళాశాల నిర్లక్ష్యం కారణంగా రెండు గంటల పాటు డిగ్రీ పరీక్ష ఆలస్యమైన ఘటన మెదక్ జిల్లా తూప్రాన్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తూప్రాన్ పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలకు కొన్ని సంవత్సరాలుగా ఎగ్జామినేషన్ సెంటర్ కేటాయించారు.గత నెల 10న డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు నలంద డిగ్రీ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈనెల 7న చివరి పరీక్ష ఉండగా బీఎస్సీ కంప్యూటర్స్ ఫస్ట్ సెమిస్టర్ గురువారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించాల్సి ఉంది. ఉదయం పరీక్ష ప్రారంభమయ్యే సమయం అయిపోయేటప్పటికీ కళాశాల యాజమాన్యం, సిబ్బంది కళాశాలకు రాలేదు. కళాశాలకు తాళాలు వేసి ఉండటంతో పరీక్ష రాయటానికి వచ్చిన నలుగురు విద్యార్థులు అవాక్కయ్యారు. ఈవిషయాన్ని విద్యార్థులు తూప్రాన్ తహసీల్దార్ విజయలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లారు. కళాశాల యాజమాన్యం, సిబ్బంది స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్ విజయలక్ష్మి ఉస్మానియా యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆడిట్ వారిని ఫోన్ ద్వారా సంప్రదించారు. విద్యార్థులు నష్టపోకుండా ఉండేందుకు పరీక్ష పత్రాలను ఎగ్జామ్ రూట్ ఆఫీసర్ సమక్షంలో యూనివర్సిటీ లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసిన ప్రశ్నాపత్రాన్ని ప్రింట్ తీసి విద్యార్థులకు అందజేశారు. దీంతో 11:45లకు ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ప్రారంభించారు. తూప్రాన్ ఆర్డీవో ఆదేశాల మేరకు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలంద డిగ్రీ కళాశాల యాజమాన్యం, సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా తూప్రాన్ పోలీసులకు తహసీల్దార్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

# నర్సాపూర్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జిగా హేమలత

నర్సాపూర్,మే1: మెదక్ జిల్లా నర్సాపూర్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జిగా న్యాయమూర్తి హేమలత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు కోర్టు సిబ్బంది, న్యాయవాదులు స్వాగతం పలికి సన్మానించారు. కరీంనగర్ నుంచి బదిలీపై జూనియర్ సివిల్ జడ్జిగా ఆమె వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయస్థానంలో సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కారం చేసేందుకు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సంపూర్ణ సహకారం అందించాలన్నారు. అనంతరం పలు కేసులను పరిష్కరిస్తూ, న్యాయవాదుల వాదోపవాదాలు విని ఆర్డర్స్, వాయిదాలు ఇస్తూ కోర్టు బెంచ్‌ను కొనసాగించారు. ఏపీపీ రాఘవేందర్,



జూనియర్ సివిల్ జడ్జి హేమలతకు స్వాగతం పలుకుతున్న న్యాయవాదులు, సిబ్బంది

ఏజీపీ సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ న్యాయవాదులు అంజిరెడ్డి, ఎండీ ఇక్బాల్‌అలీ, స్వరూపారాణి, రవినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీళ్లు రోడ్డు పాలు



సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లిలోని కూడవెల్లివాగు హైలెవల్ బ్రిడ్జిపై మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా లీకవుతున్న నీరు

తొగుట,(అక్బర్‌పేట-భూంపల్లి) మే 1: అసలే ఎండలు మండుతున్నాయి..ఎండా కాలం గ్రామాల్లో అంతంత మాత్రమే మిషన్ భగీరథ నీళ్లు సరఫరా అవుతున్నాయి. దీనికి తోడు అధికారుల నిర్లక్ష్యం కారణంగా మిషన్ భగీరథ నీళ్లు రోడ్డు పాలవుతున్నాయి. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట -భూంపల్లి మండల కేంద్రంలోని కూడవెల్లి వాగు హైలెవల్ బ్రిడ్జి వద్ద ఆయా గ్రామాలకు సరఫరా చేసే మిషన్ భగీరథ మెయిన్ పైపు లైన్ జాయింట్ వద్ద లీకై నీరు వృథాగా పోతున్నది. అధికారులు వెంటనే స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# నక్కవాగును నలిపేస్తున్నరు!

- మూడు గ్రామాల పరిధిలో కుచించుకుపోయిన వాగు
- ఎఫ్‌టీఎల్‌ను సైతం ఆక్రమించి ప్లాట్లుగా మారుస్తున్న రియల్టర్లు
- అసలే కాలుష్యం.. ఆపై కబ్జాలతో విలవిలలాడుతున్న వాగు
- ఆక్రమణలపై నీటి పారుదల, రెవెన్యూ శాఖల మౌనం

*నక్కవాగు.. దశాబ్దాల పాటు పరిశ్రమల కాలుష్యాన్ని గొంతులో నింపుకొని ఏడాదిపాటు పారే నీటి వనరు ఇది. చివరకు ఆ కాలుష్య కాసారాన్ని సైతం రియల్టర్లు వదలడం లేదు. కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్లు నక్కవాగును సైతం నలిపేసి.. ప్లాట్లుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో బఫర్‌జోన్ దేవుడెరుగు.. ఎఫ్‌టీఎల్‌ను సైతం మట్టితో కప్పేయడంతో మూడు గ్రామాల పరిధిలో వాగు కుచించుకుపోయింది. తెరపైన రియల్టర్లు కనిపిస్తున్నా తెర వెనక మాత్రం రాజకీయ నేతల అండతో పాటు అధికారుల ఆశీర్వాదం కూడా ఉందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా యంత్రాంగం స్పందించకపోతే దాదాపు ఐదు కిలోమీటర్ల పరిధిలో నక్కవాగు సన్నబడటమే కాదు భవిష్యత్‌లో జనావాసాలను వరదతో పాటు పరిశ్రమల వ్యర్థాలూ ముంచెత్తే ప్రమాదం పొంచి ఉంది.*



నక్కవాగులో మట్టిపోస్తున్న దృశ్యం

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలోని నక్కవాగు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నుంచి కాలుష్య కేంద్రంగా ప్రసిద్ధి. పటాన్‌చెరు, గడ్డపోచారం, పాశమైలారం వంటి పారిశ్రామికవాడల నుంచి యథేచ్ఛగా వచ్చే రసాయన వ్యర్థాలు ఉసికె వాగు నుంచి నక్కవాగులో కలుస్తాయనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. దీనిపై సంవత్సరాల తరబడి అధ్యయనాలు, సర్వేలు జరిగాయి. ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకున్నా.. నక్కవాగుకు కాలుష్య భూతం నుంచి పూర్తిగా విముక్తి లభించలేదు. పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థాలతో మండు వేసవిలోనూ ఈ వాగు ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో తాజాగా రియల్టర్ల కండ్లు కూడా ఈ వాగుపైనే పడ్డాయి. వాగు పక్కన ఉన్న వ్యవసాయ భూములను రైతుల నుంచి కొనుగోలు చేసిన రియల్ వ్యాపారులు వాటిని వెంచర్లుగా మలుస్తున్నారు. ఈ క్రమంలో ఆనుకొని ఉన్న వాగును సైతం అందులో కలిపేసుకొని ఎంచక్కా ప్లాట్లు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం అసలు బఫర్ జోన్ పరిధిలోనే నిర్మాణాలు చేపట్టవద్దని ఉంటే.. ఇక్కడ ఏకంగా వాగు ఎఫ్‌టీఎల్‌ను మట్టితో నింపుతున్నారు. ప్రధానంగా పటాన్‌చెరు అవుటర్ రింగు రోడ్డు నుంచి ముత్తంగి, చిట్కూరు శివారు వరకు దాదాపు ఐదు కిలోమీటర్లకు పైగా భారీ వాహనాలతో వందలాది ట్రిప్పుల్లో మట్టి పోసి నక్కవాగును చిన్న కాల్వగా మారుస్తున్నారు. పటాన్‌చెరు ఓఆర్‌ఆర్ సమీపంలో ఓ నిర్మాణ సంస్థ నక్క వాగును మట్టితో మూసివేసి సిమెంట్‌తో నిర్మాణాలు చేపట్టింది.

## అధికారుల మౌనం..

నక్కవాగును నలిపేయడంలో పైకి రియల్టర్ల పాత్ర కనిపిస్తున్నా.. వెనక రాజకీయ నాయకులు కొందరితో పాటు అధికారుల మిలాఖత్ కూడా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో అందులో వ్యర్థ జలాలు పారుతున్నా.. వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరదను మంజీరా వరకు ఈ నక్కవాగు మోసుకుపోతుంది. ఈ నేపథ్యంలో వందల ఫీట్ల వెడల్పుతో ఉండాల్సిన నక్క వాగు మట్టి పోయడంతో కుచించుకుపోతున్నది. తద్వారా వర్షాకాలంలో పెద్ద ఎత్తున వరద దిగువకు పోయే మార్గం లేక జనావాసాలకు పోటెత్తే ప్రమాదమున్నది. వాస్తవానికి నక్కవాగు దగ్గర నిత్యం వాహనాలతో మట్టిపోసి ప్లాట్లుగా మారుస్తున్న వైనం అందరి కండ్ల ముందే జరుగుతుంది. దీంతో అధికారులకు గతంలో ఫిర్యాదులు అందడంతో పాటు వారి అవగాహనలోనూ ఈ కబ్జాపర్వం ఉన్నట్లు తెలిసింది. కానీ అటు రెవెన్యూ, ఇటు నీటిపారుదల శాఖ అధికారులు మాత్రం మౌనం వహిస్తున్నారు. తద్వారా రియల్టర్లు ఇప్పుడు వాటిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తారు. అమాయకులు వాటిని కొనుగోలు చేసి.. ఎలాగోలా ఇండ్లు నిర్మించుకున్న తర్వాత తిరిగి ఆక్రమణలంటూ ఇదే అధికారగణం బుల్డోజర్లతో విరుచుకుపడి కూల్చివేస్తారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## నక్కవాగును అక్రమించే వారి పై చర్యలు

పటాన్‌చెరు మండలం నుంచి ప్రవహిస్తున్న నక్క వాగును అక్రమించే వారిపై చర్యలు తీసుకుంటాం. వాగు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ గుర్తించి అక్రమణలు తొలగిస్తాం. వాగును ఆక్రమిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. నీటిపారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని.. సర్వే చేసి తదుపరి చర్యలు తీసుకుంటాం.

**- రంగారావు, పటాన్‌చెరు తహసీల్దార్ , సంగారెడ్డి జిల్లా**

# 100శాతం అక్షరాస్యత సాధించాలి

## సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 1: జిల్లాలో నిరక్షరాస్యతను నిర్మూలించి 100 శాతం అక్షరాస్యత సాధించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పిలుపునిచ్చారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల్లో ఉన్న మహిళలందరూ తప్పనిసరిగా 100 శాతం అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు. ఓపెన్ స్కూల్ విధానంలో అందిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో మహిళా సాధికారతలో భాగంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా డ్రోన్లు, మహిళా పెట్రోల్ బంకులు, వాణిజ్య సముదాయాలు, ఇటుకల తయారీ, విద్యార్థులకు ఏకరూప దుస్తుల కుట్టు వంటి కార్యక్రమాలు జిల్లాలో అందుబాటులోకి తెచ్చామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు 80 శాతం సబ్సిడీ కింద డ్రోన్లు అందించాలన్నారు. క్యాబ్ డ్రైవర్ శిక్షణ పొంది లైసెన్స్ తీసుకున్న మహిళలకు జిల్లాలోని ప్రైవేట్ కంపెనీల్లో క్యాబ్ డ్రైవర్లుగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.సమావేశంలో సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీవో జ్యోతి, మెప్మా పీడీ గీత, జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ వెంకటస్వామి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సదాశివపేటలో క్షుద్రపూజల కలకలం

## స్థానికుల సమాచారంతో అడ్డుకున్న పోలీసులు

సదాశివపేట, మే 1: సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో క్షుద్రపూజలు కలకలం సృష్టించాయి. బంగారం ఉన్నందంటూ ఆరేండ్ల బాలికను బలి ఇచ్చే యత్నం చేసిన వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం రాత్రి బస్టాండ్ వెనుకాల గల బీరువా తయారీ ఖార్ఖానాలో బంగారం ఉన్నదని ఓ స్వామిజీని అయోధ్య నుంచి పిలిపించారనే సమాచారం. అయితే పక్కా ప్రణాళికతో బీరువా తయారీ ఖర్ఖానాలో మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో క్షుద్రపూజలు ప్రారంభించారు. ఇది గమనించిన కొందరు స్థానికులు వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షుద్ర పూజలను అడ్డుకున్నారు. ఇదిలా ఉండగా అక్కడ ఉన్న



సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో క్షుద్రపూజలు చేసిన దృశ్యం

మాంసం మనిషిదా లేక ఏదైనా జంతువుదా అని విచారించాలని స్థానికులు కోరుతున్నారు. బలి ఇచ్చేందుకు పూనుకున్న నిర్వాహకులు ఓ వ్యక్తికి డబ్బు ఆశజూపి ఆరేండ్ల బాలికను అక్కడికి తీసుకొచ్చారని స్థానికులు పేర్కొంటున్నారు. దుప్పటిలో కప్పి ఉంచిన సదరు బాలికను పోలీసులు సమయానికి రాకుంటే బలి ఇచ్చేవారని వారు ఆరోపిస్తున్నారు.

## సమస్యల వలయంలో

# డబుల్ బెడ్‌రూమ్ కాలనీ



సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని డబుల్‌బెడ్‌రూమ్ కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం



సిద్దిపేట జిల్లా దుబ్బాక డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో పిచ్చిమొక్కలు

- దుబ్బాకలో పారిశుధ్య లోపం
- దుర్గంధంలో కాలనీవాసుల జీవనం

దుబ్బాక, మే 1 : సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. బీఆర్ఎస్ హయాంలో నిరుపేదల సొంతింటి కల నెరవేర్చితే...కాంగ్రెస్ పాలనలో డబుల్ బెడ్‌రూమ్ కాలనీ ప్రజలపై నిర్లక్ష్యం చూపుతున్నది. దుబ్బాకలో నిరుపేదల కోసం మల్లాయిపల్లి రోడ్డులో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించారు. ఈ కాలనీలో 76 బ్లాక్‌లు, ఒక్కో బ్లాక్‌లో 12 ఇండ్లు నిర్మించారు. సుమారు 3 వేలకు పైగా ఇక్కడ జనాభా నివసిస్తున్నది. కొంతకాలంగా ఈ కాలనీని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగిసిపోవడంతో కాలనీ ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రధానంగా తాగునీరు. పారిశుధ్య లోపంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం..

దుబ్బాక డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టక పోవడంతో ప్రజలకు సమస్యగా మారింది. డ్రైనేజీలు నిండి, మురుగు రోడ్డుపైకి చేరుతున్నది. కాలనీలోని అంతర్గత రహదారులపై పారుతున్న మురుగుతో ప్రజలు అనారోగ్యంపాలవుతున్నారు. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో మరింత సమస్యగా మారింది. దోమలు , విషకీటకాలు వృద్ధి చెందడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాలనీలో పారిశుధ్యం, ఇతర సమస్యలపై మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని స్థానికులు గోడు వెల్లబోసుకుంటున్నారు.

### కాలనీని సందర్శిస్తా

డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో డ్రైనేజీ సమస్య ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. కాలనీని సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తా. పారిశుధ్యం మెరుగుపర్చేందుకు కాలనీ ప్రజలు రోడ్లపై చెత్తాచెదారం వేయకుండా సహకరిస్తే బాగుంటుంది. ఇందు కోసం కాలనీ ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించేందుకు మావంతు కృషిచేస్తాం.

**– శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దుబ్బాక, సిద్దిపేట జిల్లా**

### ఇబ్బందులు పడుతున్నాం



డబుల్ బెడ్‌రూమ్ కాలనీపై అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. ఇక్కడ ఉండేది నిరుపేదలమే. రెక్కాడితే డొక్కాడని మా బతుకులు. కాలనీలో తాగునీటితో పాటు పారిశుధ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయంపై పలుమార్లు మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

**– కారంపూరి నగేశ్, కాలనీవాసి, దుబ్బాక, సిద్దిపేట జిల్లా**

### అధికారులు స్పందించాలి



డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో చాలా సమస్యలు నెలకొన్నాయి. ఇక్కడికి ఏ అధికారి రావడం లేదు. మురుగు కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. దోమలు, విషకీటకాలతో అనారోగ్యం పాలవుతున్నాం. మురుగు కాల్వలను మేమే శుభ్రం చేసుకునే పరిస్థితి ఉంది. అధికారులు మా సమస్యలను పరిష్కరించాలి.

**– సామిలేటి రాజేందర్, కాలనీవాసి,దుబ్బాక, సిద్దిపేట జిల్లా**